సుజనరంజని
జూలై 2007
సర్వజిత్ : నిజ జ్యేష్ఠం
సిలికానాంధ్ర

# నటరంజని : స్నేహశీలి, నిర్మల స్వభావి, హిమబిందు చల్ల గారు

పి.డి.ఎఫ్. పత్రం (PDF Doc)

**-- కాకుళవరపు రమ**



వెంపటి చినసత్యం మాస్టారు గారి దగ్గర కూచిపూడి నాట్యములో శిక్షణ పొంది ప్రావీణ్యులైన విద్యార్థినీ విద్యార్థులలో ఎంతో మంది భారత దేశంలోనే కాకుండా అమెరికా, కెనడా వంటి దేశాలలో కూడా స్థిరపడి తమకున్న ప్రతిభను, క్రమశిక్షణను నవతరం వారికి పంచి ఇస్తూ, మంచి స్వభావముతో మనసును ఆకొట్టుకొంటూ ఆ కళ అడుగంటి పోకుండా తమ శాయశక్తులా కృషి చేస్తున్నారు. వారిలో ఈసారి మేము ఎంపిక చేసుకున్న కళాకారిణి ఫ్రీమౌంట్, కాలిఫోర్నియా లో నివసిస్తున్న హిమబిందు చల్ల గారు. వీరు 1996వ సంవత్సరములో భారత దేశాన్ని వదిలి లాస్ ఏంజిలిస్ కి వలస వచ్చారు. అక్కడ ఆరుసంవత్సరాలు వున్న తరువాత కొంతకాలం మాంట్రియల్, కెనడా లో నివసించి 2003 వ సంవత్సరము నుండి ఫ్రీమౌంట్ లో స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. ఆవిడ గారి భర్త పేరు దేవకుమార్ మన్నెల, హాలివుడ్ మూవీస్ - జార్జ్ లుకాస్ స్టూడియో - ఐ.ఎల్.ఎం. - స్పెషల్ ఎఫెక్ట్స్ డివిజన్ లో ఉద్యోగస్తులు. వీరికి ఇద్దరు మగ పిల్లలు విక్రాంత్ (7 సంవత్సరాలు), విఘ్నేశ్ (4 సంవత్సరాలు).

2004వ సంవత్సరములో సిలికానాంధ్ర నిర్వహించిన "తెలుగుతేజం" ద్వారా బే ఏరియా లో అందరికీ సుపరిచతమయ్యారు. అదే సంవత్సరములో "నృత్యానంద" పేరుతో ఒక నాట్య కళాశాలను ప్రారంభించారు. ఆవిడ దగ్గర ప్రస్తుతం సుమారు 30 మంది విద్యార్థినీ విద్యార్థులు నాట్యం నేర్చుంకుంటునారు.

హిమబిందు గారు చాలాచిన్న వయసులోనే (అంటే అయిదు సంవత్సరాలున్నప్పుడే) నెల్లూరులో తల్లితండ్రులు కూచిపూడి నాట్యం నేర్చుకోవడానికి చేర్పించారు. అమ్మ గారి పేరు సులోచన, తండ్రి పేరు శివరామి రెడ్డి గారు - కాంట్రాక్టు బిజినెస్. ఆ తరువాత కొంతకాలానికి మద్రాసులో స్థిర పడ్డాక తల్లితండ్రులు మాస్టారు గారి దగ్గర చేర్చడానికి ప్రయత్నిస్తే ఆయన వయసు ఎనిమిది సంవత్సరాలన్నా ఉండాలని చెప్పగా తిరిగి పది సంవత్సారల వయసులో వచ్చి అకాడెమి లో చేరారు.



ఆవిడ మాస్టారు గారి దగ్గర నాట్యం నేర్చుకునే రోజుల గురించి మాట్లాడుతూ తన

జీవితములో అది ఒక మరపురాని ప్రయాణమని, ఒక గోల్డెన్ చాప్టర్ అని వర్ణించారు. ఆయన అకాడెమిలో చేరిన వారికి ఎవరికయినా నాట్యం మీద మక్కువ, క్రమశిక్షణ కూడా దానంతట అదే అలవడుతుందన్నారు. అంతే కాకుండా కొత్తగా చేరిన వారు తమ కన్నా ముందే చేరిన వారి దగ్గర చూసి నేర్చుకోవడం ఒక అభ్యాసన అని చెప్పారు. ఆవిడ కూడా మాస్టారు గారి చిన్న కొడుకయిన రవి గారు నాట్యం చేస్తుండగా చూసి ఎంతో నేర్చుకున్నారని, ఆయనను అనుకరించడానికి ఎంతో ప్రయత్నించారని చెప్పుకున్నారు. స్కూలు నుండి ఇంటికి రాగానే హోం వర్కు పూర్తి చేసుకుని పదిహేను నిముషాల దూరంలో ఉన్న అకాడెమీకి సైకిలు మీద వెళ్ళే వారని చెప్పారు. అక్కడికి వెళ్ళ గానే అందర్నీ చూసి ఎంతో ఆనందం కలిగేదని, రెండు బాచీలుగా క్లాసులు జరిగేవని, తమ వంతు వచ్చే వరకు వేచి చూసి ఆతరువాత ఎంత సేపు నేర్చుకున్నా అలసట అనేది లేకుండా ఎంతో ఉత్సాహంగా కూడా ఉండేదన్నారు. నాట్యము ఎవరికి వారు తమంతట తాము నేర్చుకోవడం కన్నా నాట్యం చేస్తున్న వారిని పరిశీలించటం అక్కడి విద్యార్థులకు చక్కటి ఆచరణ అన్నారు.

అకాడెమిలో ప్రొద్దున మాస్టారు గారు, సాయంత్రము సీనియర్ విద్యార్థులు క్లాసులు తీసుకొనే వారని, ఒక్క శని,ఆది వారాలలో మటుకు ప్రొద్దున పూట మాస్టారు గారు చెప్పే క్లాసులో నేర్చుకునే భాగ్యం కలిగేదని ఆవిడ అన్నారు. ప్రతివారు మాస్టారు గారి నుండి మెప్పుదల పొందాలని, అందరిలోను అధికృతగా ఉండడానికి ఎంతో ప్రయత్నించే వారని ఆవిడ అన్నారు. ఆయన ఒక విద్యార్థిని మెచ్చుకోవటం చాలా అరుదని కూడా అన్నారు. ఆయన అలా చేయక పోవటం వలన విద్యార్థులకు ఇంకా బాగా నేర్చుకోవాలనే తపన, పట్టుదలే అక్కడి విద్యార్థినీ విద్యార్థులకు ఒక గట్టి పునాది వేసిందన్నారు. 1998లో మాస్టారు గారు అకాడెమిని అడయారుకు మార్చేటప్పటికి, ఇంటికి దూరమయ్యిందని, మాస్టారు గారి సీనియరు విద్యార్థిని అయిన సత్యప్రియ రమణ గారి దగ్గర నాట్యము కొనసాగించవలసి వచ్చింది. సత్యప్రియ గారు నాట్యానికి బాగా అంకితమయిన వ్యక్తి. ఆవిడ దగ్గర నేర్చుకుంటున్న సమయంలో హిమబిందు గారికి ఎన్నో సోలో డాన్సెస్ చేసే అవకాశం లభించిందన్నారు, అల్లాగే కూచిపూడిలోని అడ్వాన్స్‌డ్ అయిటంస్ అన్నీ కూడా అవిడ దగ్గరే నేర్చుకోవటం జరిందని అన్నారు. హిమ గారు కాలేజిలో చదువుకుంటున్న రోజుల్లో వేరే పిల్లలకు నేర్పే అవకాశం కూడా కలిగిందని చెప్పారు. కానీ యేదన్నా ప్రదర్శనలు ఇవ్వవలసి వచ్చే సమయంలో మటుకు మాస్టారు గారి అకాడెమిలోనే రిహార్సల్స్ జరిగేవని అన్నారు.

హిమబిందు గారు నాట్యంతో పాటు సంగీతం, వీణ కూడా నేర్చుకున్నారు. ఆవిడ అభివృద్ధికి తల్లితండ్రులే దోహదకారకులని, వారి ప్రోత్సాహం కూడా ఎంతో ఉందని, వారికి తాను జీవితాంతము కృతజ్ఞురాలినని అన్నారు. సత్యప్రియగారు ఎంతో స్నేహ స్వభావురాలని, మాస్టారుగారు తనకు దేవుడితో సమానమని పేర్కొన్నారు. తాను ఎన్నడూ మరచి పోలేని ఒక గొప్ప అనుభవాన్ని ఇలా చెప్పారు: ఒక సారి నాట్య ప్రదర్శనలో శివుడి పాత్రను పోషించినపుడు మాస్టారు గారు తనను దీవించి ఎంతో ప్రేమగా వీపు మీద తట్టారని చెప్పారు. ఆయన తన క్రియలు మాటల్లో కన్నా చేతల్లో ఎక్కువగా కనిపించేవని, చూపించే వారని అన్నారు. ఆవిడ ప్రారంభించిన నృత్యానంద నాట్య కళాశాలలో కూడా మాస్టారు గారి అకాడెమిలో వారు పొందిన క్రమశిక్షణ, తన విద్యార్థినీ విద్యార్థులకు ఆ అదరణ కూడా లభించేటట్లు చేస్తానని ఆవిడ అన్నారు. తనను ఎంతో ప్రోత్సహించి ఒక కళాకారిణిగా రూపు దిద్దిన తన తల్లితండ్రులకు, మాస్టారు గారికి, సత్యప్రియరమణ గారికి, ఇప్పుడు చేయూతనిస్తున్న తన భర్తకు హృదయ పూర్వకంగా కృతజ్ఞతలను తెలుపుకున్నారు.

హిమబిందు గారు మాస్టారు గారి రూపకల్పనలో ప్రదర్శించిన ఎన్నో నృత్య నాటకాలలో పాత్రధారులయ్యారు. ఉదాహరణకు 1996 చెన్నయ్ లో ప్రదర్శించిన "శ్రీనివాస కళ్యాణం"లో శివుడిగా, "అర్ధనారీశ్వరం"లో సింధూ నదిగా, "శాకుంతలం" లో గౌతమిగా

మరియు ఇన్వొకేషన్ డ్యాన్సులో , 1998 అమెరికా టూర్ కి వచ్చినపుడు "మేనకా విశ్వామిత్ర" లో ధరణీ దేవిగా, అలాగే 2002లో అట్లాంటా, డెట్రాయిట్, పిట్స్ బర్గ్ పట్టణాల్లో మరలా "మేనక విశ్వామిత్ర" ప్రదర్శించినపుడు విశ్వామిత్రుడిగా, ఇంకా 2005లో పసుమర్తి వేంకటేశ్వర శర్మ గారి "మసిషాసుర మర్ధిని" నృత్య నాటిక లో శివుడిగా నటించే అవకాశం కలిగిందని ఆవిడ చెప్పారు.



అంతే కాకుండా కూచిపూడి నాట్యం ఉదయించిన కూఛిపూడి గ్రామములో, 2000 సంవత్సరము లో జరిగిన "సిద్దేంధ్ర యోగి కూచిపూడి ఫెస్టివల్" లో చాలా మంది పేరుమోసిన కళాకారుల నాట్యాన్ని చూసే అదృష్టమే కాకుండా, తనకున్న నాట్య కళను వారందరి ముందు ప్రదర్శించే అవకాశం తనకు కూడా లభించిందని ఎంతో గర్వంగా చెప్పుకునారు. ఇలా భారత దేశంలో జరిగిన అనేక కార్యక్రమాలలోను, ప్రదర్శనలోను మరియు అండమాన్ నికోబార్ లో జరిగిన "ఫెస్టివల్ అఫ్ ఇండియా" లోను ఆవిడ పాల్గొన్నారు. ఇలా ప్రదర్శనలిస్తూ, తనకు తోచిన విధంగా నాట్యాన్ని పిల్లలలకు నేర్పించడమే కాకుండా, ప్రఖ్యాత విద్వాంసులైన రవిశంకర్ గారి సితార్ మ్యూజిక్కంపోజిషన్స్ తన నాట్యం కొరియొగ్రాఫిలో ఉపయోగించటం చాల ప్రీతికరమయిన విషయమని చెప్తూ ముగించారు.